# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 272 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శుక్రవారం 29 మే 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి





# టీజీఐఐసీ భూముల వేలానికి రికార్డు ధర

## ఎకరం రూ.237 కోట్లు

**రాయదుర్గం పాన్ మక్తాలో**

**రూ.237 కోట్లు పలికిన ఎకరం -**

**గతేడాది అక్టోబర్‌లో ఇదే ప్రాంతంలో**

**రూ.177 కోట్లు పలికిన ఎకరం**

**హైదరాబాద్, మే 28 (నమస్తే ఉదయం)**

తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ రాయదుర్గం నాలెడ్జ్ సిటీ పరిధిలోని సర్వే నంబర్ 83/1 లో చేపట్టిన భూ వేలానికి మైండ్ బ్లోయింగ్ రెస్పాన్స్ వచ్చింది. 83/1లో 6 ఎకరాల 9 గుంటలకు వేలం వేయగా రికార్డుస్థాయి ధర పలికింది. రాయదుర్గంలో ఒక ఎకరం భూమి అక్షరాలా రూ.237 కోట్లు పలికింది. గతేడాది ఇదే ప్రాంతంలో ఒక ఎకరం భూమి ధర రూ.177 కోట్లు పలికింది. వేలంలో భూమిని గౌర వెంచర్స్ దక్కించుకుంది. వేలం వేసిన భూమి మల్టీ-యూజ్ కేటగిరీ కింద వస్తుంది. అంటే దీనిని కమర్షియల్, రెసిడెన్షియల్, రిటైల్ లేదా హోటల్స్ వంటి ఏ అవసరాలకైనా వాడుకోవచ్చు. మైండ్‌స్పేస్ ఐటీ పార్క్, T-Hub, T-Works, క్వాల్‌కామ్ క్యాంపస్, రాయదుర్గం మెట్రో స్టేషన్‌లకు అత్యంత సమీపంలో ఉండటంతో అక్కడి భూములకు భారీగా గిరాకీ ఏర్పడింది.

# ఫ్యూచర్ సిటీ దేశానికే తలమానికం

**మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు ఫ్యూచర్ సిటీలో పర్యటన**

**ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయ భవనం నిర్మాణ పనుల పరిశీలన**

**స్కిల్ యూనివర్సిటీ పనుల పరోగతి పరిశీలించిన మంత్రులు**

**హైదరాబాద్, మే 28 (నమస్తే ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను మంత్రులు పరిశీలించారు. అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి : ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో ..మిగతా 2లో






## సంక్షేమ పథకాల

# వివరాలన్నీ ఒకే చోట

**విప్లవాత్మకమైన మార్పుకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం**

**ప్రత్యేకంగా 'సమగ్ర సంక్షేమ కార్డు'**

**హైదరాబాద్, మే 28 (నమస్తే ఉదయం)**

రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే చోట లభించేలా ఒక విప్లవాత్మకమైన మార్పుకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా 'సమగ్ర సంక్షేమ కార్డు' ను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలని సూచించారు. సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్. కె.రామకృష్ణారావు ఇతర ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి ఈ విషయంపై ఇవాళ ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

**ఏఐతో అక్రమాలకు చెక్:**

సంక్షేమ పథకాల డేటాను సేకరించేందుకు తక్షణమే అన్ని శాఖల నుంచి ఒక ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో ..మిగతా 2లో



## తడిసిన ధాన్యం కూడా మద్దతు ధరకే కొనుగోలు చేస్తాం

**మంత్రి ఉత్తమ్**

**భువనగిరి, మే 28 (నమస్తే ఉదయం)**

తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లపై యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో..మిగతా 2లో

# సహకారంతో పరిష్కరించుకోండి

**జల వివాదాలపై రాష్ట్రాలకు ప్రధాని సూచన**

**న్యూఢిల్లీ, మే 28 (నమస్తే ఉదయం)**

దేశంలో దీర్ఘకాలంగా నలుగుతున్న వివాదాల్లో అంతరాష్ట్ర జలాల అంశం ఒక్కటి. రాష్ట్రాల మధ్య సరైన సహకారం లేకపోవడంతో ఎన్నో ఏళ్ళుగా ప్రతిపాదిత ప్రాజెక్టులు పెండింగ్ పడుతున్నాయి. ఈ నేపథ్య అంతర్రాష్ట్ర జల వివాదాలపై రాష్ట్రాలకు ప్రధాని మోడీ కీలక సూచన చేశారు. జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని, సకాలంలో అనుమతులు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణతో సమస్యలు అధిగమించాలన్నారు. ఈ క్రమంలో మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ ..మిగతా 2లో



# ప్రధాని కార్యాలయం పర్యవేక్షణలో నీట్ రీటెస్ట్



**కేంద్రం కీలక నిర్ణయం**

రీటెస్ట్ ప్రక్రియను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు 2



## రానున్న ఐదేళ్లలో 200 ఇంటర్ సిటీ

# రైళ్ల తయారీ

**కాజీపేటలో తయారయ్యే రైళ్లను స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగిస్తామన్న మంత్రి** 2

## ముఖ్యమంత్రి పదవికి

# సిద్దరామయ్య రాజీనామా

**తదుపరి సీఎంగా డీకే శివకుమార్?** 2

రాజీనామా లేఖ ఇచ్చి లోక్‌భవన్ నుంచి వెళ్లిపోయిన సిద్దరామయ్య

సిద్ధరామయ్య స్థానంలో సీఎం పదవి చేపట్టనున్న డీకే శివకుమార్!

# ఫ్యూచర్ సిటీ దేశానికే తలమానికం

**మొదటి పేజీ తరువాయి...**

అభివృద్ధి చేస్తోందని తెలిపారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంగా స్కిల్ యూనివర్సిటీ నిలవబోతుందని పేర్కొన్నారు. నగర అభివృద్ధి పనులకు మరింత వేగం : ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా నగర అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని అన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. దేశంలోనే అత్యుత్తమ మౌలిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం, సుస్థిర అభివృద్ధి ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు స్పష్టం చేశారు.



"లక్షలాది మందికి ఉపాధి, వారికి ఉద్యోగ భద్రత కల్పించే ఒక మంచి ఆలోచనతో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ప్రపంచంలో ఏ దేశానికి ఏ రాష్ట్రానికి రాని ఆలోచన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహచర మంత్రివర్గానికి వచ్చింది. సీఎం, మంత్రివర్గ కలిసి చేస్తున్న ఈ మంచి కార్యక్రమానికి ప్రతిపక్షాలు కూడా సహకరిస్తాయని అనుకుంటున్నాం. మరింత ఉత్సాహంతో పని చేస్తున్నాం. ఫ్యూచర్ సిటీ దేశానికి తలమానికం కానుంది. ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోంది" – పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మంత్రి

"అత్యుత్తమ సాంకేతికతతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీని నిర్మిస్తోంది. గ్లోబల్ ప్రజెన్స్ ఉన్న కార్యాలయాలు కూడా ఫ్యూచర్ సిటీ నుంచే నడపాలనే ఉద్దేశ్యంతో ముందుకు వెళ్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేస్తున్నాం. బీఆర్ఎస్ నేతలు హరీశ్ రావు, కేటీఆర్‌లు ఏదిపడితే అది మాట్లాడతారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను చెడగొట్టే ప్రయత్నం ఎవరూ చేసిన ఊరుకునేది లేదు. మీరు ప్రయత్నం చేస్తూనే ఉండండి. మేము మా పనితనం చూపిస్తూనే ఉంటాం" – శ్రీధర్ బాబు, మంత్రి

# తడిసిన ధాన్యం కూడా మద్దతు ధరకే కొనుగోలు చేస్తాం

**మొదటి పేజీ తరువాయి...**

సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబుతో కలిసి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని కలెక్టర్ అనురాగ్ జయంతి వివరించారు. సమీక్షకు ముందు యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు పరిశీలించి రైతులతో మాట్లాడారు. రానున్న నాలుగు రోజులూ యంత్రాంగమంతా అప్రమత్తంగా వ్యవహరించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని అధికారులకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అవసరమైతే ప్రైవేట్ లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఉపయోగించుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్ 1 నాటికి కొనుగోళ్లు పూర్తి చేయాలని చెప్పారు. ఎమ్మెల్యేలు కూడా దీనికి సహకరించాలని ఆయన సూచించారు. తమ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి కనీవినీ ఎరుగని రీతిలో దిగుబడులు వచ్చాయని.. ప్రతి గింజనూ రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని ఉత్తమ్ తెలిపారు. ప్రతిపక్షాలు రాజకీయం చేయడానికి యాత్రలు చేపడుతున్నాయన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. భాజపా నాయకులు బస్సు యాత్రలు



చేయడం కాదని.. దిల్లీ యాత్ర చేసి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన నిధులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. వడ్లు అంటే తెలియని వారు వాటి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రైతులకు సంకెళ్లు వేసి నడిరోడ్డుపై తిప్పిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్ కుమార్ రెడ్డి, మందుల సామేల్ తదితరులు పాల్గొన్నారు.

# రానున్న ఐదేళ్లలో 200 ఇంటర్ సిటీ రైళ్ల తయారీ

**హైదరాబాద్, మే 28 (నమస్తే ఉదయం)**

తెలంగాణ రాష్ట్రంలోని కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్ పూర్తి కావొచ్చిందని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. త్వరలో అక్కడ ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని అన్నారు. రానున్న ఐదేళ్లలో ఈ యూనిట్ 200 ఇంటర్ సిటీ రైళ్లను తయారు చేస్తుందని అన్నారు. కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌పై ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇక్కడ తయారయ్యే రైళ్లను దేశవ్యాప్తంగా స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చే ఇంటర్ సిటీ రైళ్లు ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్‌తో రూపొందుతాయని అన్నారు. ప్రతి రైలులో 20 కోచ్‌లు ఉంటాయని అన్నారు. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రైళ్లను తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఈ రైళ్లలో రీజనరేటివ్ బ్రేకింగ్ ఉంటుందని అన్నారు. రైలు బ్రేకులు వేసినప్పుడు ఉత్పత్తి అయిన విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌లోకి పంపే ఆధునాతన పరిజ్ఞానంతో తయారు చేస్తున్నామని అన్నారు.

# సిద్ధరామయ్య రాజీనామా

**బెంగళూరు, మే 28 (నమస్తే ఉదయం)**

కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. ఉపముఖ్యమంత్రి శివకుమార్‌తో కలిసి లోక్‌భవన్‌కు వెళ్లిన సిద్ధరామయ్య తన రాజీనామాను సమర్పించారు. ప్రస్తుతం గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ బెంగళూరులో లేనందున గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ప్రభు శంకర్ రాజీనామా పత్రాన్ని స్వీకరించారు. వ్యక్తిగత పర్యటన నిమిత్తం తన స్వస్థలం మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌కు గవర్నర్ వెళ్లారు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత సిద్ధరామయ్య రాజీనామాపై నిర్ణయం తీసుకుంటారు. తర్వాత మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సిద్ధరామయ్య కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు తాను రాజీనామా చేసినట్లు ప్రకటించారు. గవర్నర్ బెంగళూరు తిరిగి వచ్చిన తర్వాత రాజీనామాపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు.



**నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చాను: సిద్ధరామయ్య**

రాజీనామా సమర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ సిద్ధరామయ్య భావోద్వేగానికి గురయ్యారు. తాను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చానని సిద్ధరామయ్య చెప్పారు. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదన్నారు. తన కుటుంబంలో ఎవరూ రాజకీయాల్లో లేరని ఆయన వివరించారు. సామాజిక న్యాయం, సమానత్వాన్ని నమ్ముతానని తెలిపారు. సమాజంలో అసమానతలు తొలగాలని కోరుకుంటానని వెల్లడించారు. అందరికీ సమాన అవకాశాలు దక్కాలన్నారు. తాను రాజ్యాంగాన్ని గౌరవిస్తానని చెప్పారు. "నేను ముఖ్యమంత్రి పదవికి రాజ్‌భవన్‌లో రాజీనామా సమర్పించాను. గవర్నర్ ప్రస్తుతం బెంగళూరులో లేరు . కాబట్టి, నా రాజీనామా పత్రాన్ని వారి కార్యాలయంలో ఆయన కార్యదర్శికి అందజేశాను. ఆ తర్వాత వారు తీసుకునే నిర్ణయానికి సంబంధించిన విధానం వారి ఇష్టం. కానీ ఒకసారి ముఖ్యమంత్రులు రాజీనామా చేసిన తర్వాత దాన్ని ఆమోదించి తదుపరి ముఖ్యమంత్రికి అవకాశం కల్పించడం వారి బాధ్యత. నా రాజీనామాను గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం ఉంది. మా పార్టీ (కాంగ్రెస్) 135o1 స్థానాలను గెలుచుకుంది. దీనికి తోడు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు కూడా మా ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. కాబట్టి మాకు సంపూర్ణ మెజారిటీ ఉంది. అందువల్ల రాజ్యాంగబద్ధంగా తదుపరి ముఖ్యమంత్రికి అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేయాలనుకుంటున్నాను. అధిష్ఠానం సూచనలతో రాజీనామా చేశాను. హైకమాండ్ ఆదేశాలకు అందరం కట్టుబడి ఉంటాం. సీఎంగా నాకు అవకాశమిచ్చిన సోనియా, రాహుల్, ఖర్గేకు ధన్యవాదాలు. 7 కోట్ల మంది కర్ణాటక ప్రజలకు సేవలందించే అవకాశం వచ్చింది. రాజ్యాంగమే మా ధర్మం ప్రజలే మా దేవుళ్లు. నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చాను. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదు. నా కుటుంబంలో ఎవరూ రాజకీయాల్లో లేరు. 2006లో కాంగ్రెస్ పార్టీలో చేరాను. పార్టీలో చేరినప్పటి నుంచి కాంగ్రెస్ నన్ను ఆదరించింది. సీఎంగా, ఎల్‌వోపీగా రెండుసార్లు సేవలందించాను. ఏడు కోట్ల కన్నడ ప్రజలకు సేవలందించాను. నేను రాజ్యాంగాన్ని గౌరవిస్తాను. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చే యత్నం చేశాను. మేనిఫెస్టోలో ఇచ్చిన 160 హామీల్లో 158 నెరవేర్చాను. మొదటి ఏడాదిలోనే ఐదు గ్యారంటీలు నెరవేర్చాను. శాసనసభలో మాకు పూర్తి మెజారిటీ ఉంది. నాపై ప్రతిపక్షాలు వదంతులు ప్రచారం చేశాయి. తలసరి ఆదాయంలో కర్ణాటక అగ్రస్థానంలో ఉంది. జీఎస్టీ వసూళ్లలో కర్ణాటక రెండో స్థానంలో ఉంది. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లే ఉద్దేశం లేదు. రాజ్యసభకు వెళ్లాలని అధిష్ఠానం సూచించింది. రాజ్యసభకు వెళ్లబోనని హైకమాండ్‌కు చెప్పా. కర్ణాటకలో ఎమ్మెల్యేగానే కొనసాగుతా. రాజకీయాల్లో క్రియాశీలకంగానే ఉంటా. నా ఆదర్శాల విషయంలో ఎప్పుడూ రాజీపడను. తదుపరి ముఖ్యమంత్రిని శాసన పక్షం, హై కమాండ్ నిర్ణయిస్తుంది."

–సిద్ధరామయ్య, కర్ణాటక ముఖ్యమంత్రి

**సీఎం పదవి చేపట్టనున్న డీకే శివకుమార్!**

అంతకుముందు ఈ ఉదయం బెంగళూరులోని తన అధికారిక నివాసంలో మంత్రులు, ఎమ్మెల్యేలకు సిద్ధరామయ్య అల్పాహార విందు ఇచ్చారు. ఈ సందర్భంగా తన రాజీనామా విషయాన్ని మంత్రులకు తెలియజేసిన సిద్ధరామయ్య తదుపరి సీఎం డీకే శివకుమార్ అని ప్రకటించారు. సిద్ధరామయ్యకు డీకే శివకుమార్ పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. తర్వాత వారిద్దరూ ఆలింగనం చేసుకున్నారు.

ఇదిలా ఉండగా, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామా నిర్ణయానికి వ్యతిరేకంగా ఆయన మద్దతుదారులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. శివమొగ్గలోని శివప్ప నాయక సర్కిల్ వద్ద ఆయన మద్దతుదారులు ధర్నాకు దిగారు. కురుబ సామాజికవర్గానికి చెందిన నేతలు ఈ నిరసనకు నాయకత్వం వహించారు. రెండు పొట్టేళ్లను కూడా ఘటనా స్థలానికి తీసుకువచ్చారు. సిద్ధరామయ్య నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తంచేస్తూ రోడ్డుపై టైర్లను తగులబెట్టారు. సిద్ధరామయ్యే సీఎంగా కొనసాగాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అన్న రామయ్య అహిందా నేత సిద్ధరామయ్య అంటూ ఆయనకు మద్దతుగా నినాదాలు చేశారు. ముఖ్యమంత్రిగా కొనసాగాలని డిమాండ్ చేశారు. యాద్గిర్‌లో సిద్ధరామయ్య వీరాభిమాని రాజ్‌కుమార్ గణీర్ అనే వ్యక్తి సుభాష్ చంద్ర సర్కిల్ వద్ద మౌనప్రదర్శనకు దిగారు. ఆయన రాజీనామా నిర్ణయంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.



# సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే చోట

**మొదటి పేజీ తరువాయి...**

విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందన్నారు. ఈ విధానం అనుసరించడం వల్ల నిజమైన అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరుతాయని, అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు.

**ఆధార్ తరహాలో ప్రత్యేక నంబర్:**

ప్రభుత్వం ఇవ్వబోయే సమగ్ర సంక్షేమ కార్డులో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, బీమా పథకాలు, ప్రభుత్వం తీసుకొస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ జరగాలని సూచించారు. ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని, వెంటనే దాని ఆధారంగా చర్యలు మొదలయ్యేలా ఉండాలన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో లింక్ చేయాలని చెప్పారు. కేరళ నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్ట్‌లు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం ఒకచోట అందుబాటులో ఉంచితే, అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని ముఖ్యమంత్రి గారు స్పష్టం చేశారు.

# సహకారంతో పరిష్కరించుకోండి

**మొదటి పేజీ తరువాయి...**

రాష్ట్రాల మధ్య సాగుతున్న కెన్–బెత్వా ప నదుల అనుసంధానం ప్రాజెక్టు దేశానికే ఒక నమూనగా నిలవాలని ఆకాంక్షించారు. వివిధ రాష్ట్రాల్లో సాగుతున్న పలు అభివృద్ధి పనులపై నిన్న సాయంత్రం ప్రధాని మోడీ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించించి ఈ సూచన చేశారు.

**సౌకర్యాలు అందకుండా పోతాయి:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు ఉద్దేశించిన ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ద్వారా.. రైల్వే, విద్యుత్, రహదారుల రంగానికి చెందిన సుమారు రూ. 30,000 కోట్ల విలువైన 7 కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రధాని సమీక్షించారు. తొమ్మిది రాష్ట్రాల పరిధిలోకి వచ్చే ఈ ప్రాజెక్టుల అమలులో ఆలస్యం జరిగితే అంచనా వ్యయం పెరగడమే కాకుండా, ప్రజలకు సకాలంలో అవసరమైన సౌకర్యాలు అందకుండా పోతాయని మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక నీటి భద్రతను సాధించడానికి నదుల అనుసంధానం, నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీఛార్జ్, సమర్థవంతమైన నీటి పారుదల (×తీతీఅస్త్రఃఅశీఅ) ప్రక్రియలను ఒకదానితో ఒకటి అనుసంధానించేలా సమగ్ర ప్రణాళికలను గుర్తించాలని ఈ సందర్భంగా రాష్ట్రాలను మోడీ కోరారు.

**తెలుగు రాష్ట్రాల్లో జల వివాదాల వేళ:**

కాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య చాలా కాలంగా నీటి వనరుల పంపకాలు, ప్రాజెక్టుల విషయంలో జల వివాదాలు కొనసాగుతున్నాయి. కృష్ణా, గోదావరి నదీ జలాలా తెలుగు రాజకీయాలు సాగుతున్నాయి. ఈ రెండు నదుల నీటి పంపకాలు, బనకచర్ల లింకేజ్ ప్రాజెక్టు, మహారాష్ట్రతో తమ్మిడి హట్టి వంటి ప్రాజెక్టు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వం చర్చలు జరపవలిసి ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ చేసిన సూచన ఆసక్తిగా మారింది.

# ప్రధాని కార్యాలయం పర్యవేక్షణలో నీట్ రీటెస్ట్

## రీటెస్ట్ ప్రక్రియను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు

**న్యూఢిల్లీ, మే 28 (నమస్తే ఉదయం)**




దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 21 నిర్వహించే రీటెస్ట్‌లో మరోసారి ఎలాంటి లోపాలు తలెత్తకుండా కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఈసారి రీటెస్ట్ ప్రక్రియను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పేపర్ తయారీ నుంచి ఫలితాల వరకు నిశితంగా పరిశీలించనుంది. దిల్లీలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బక్తీ శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



ప్రేమావతి పేట్ మసీదు వద్ద ముస్లిం సోదరులు



జన చైతన్య కాలనీ జామా మసీదు ఘుడాబేగ్ వద్ద ముస్లిం సోదరులు



ప్రార్థనలో పాల్గొన్న ముస్లిం సోదరులు

**బుద్వేల్, మే 28 (నమస్తే ఉదయం):**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలో గురువారం ఈద్ ఉల్ అధా (బక్రీద్) పండుగను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. త్యాగానికి ప్రతీకగా ఈ పండుగ ను ముస్లిం సోదరులు జరుపుకుంటారు. పండుగ సందర్భంగా మసీదులు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిం చారు. ఈద్ అంటే పండుగ అని, ఖుర్బానీ అంటే త్యాగం అని బావిస్తు ఈ పండుగను నిర్వహిస్తామని ముస్లీం సోదరులు పేర్కొన్నారు. అల్లాహ్ (దేవుడు) ఆదేశాను సారం తన ఏకైక కుమారుడైన ఇస్మాయిల్ ను బలి ఇవ్వడానికి సిద్ధపడిన ఇబ్రహీం ప్రవక్త యొక్క గొప్ప త్యాగాన్ని, అంకిత బావాన్ని స్వరించుకుం టు ఈ పండుగ ను నిర్వహిస్తారు. ఇబ్రహీం ప్రవక్త భక్తీని మెచ్చి దేవుడు అఖరి నిమిషంలో ఆయన కుమారుడికి బదులుగా ఒక గొర్రెను బలి ఇచ్చేలా చేశాడని విశ్వసిస్తారు. అందుకే ఇబ్రహీం ప్రవక్త త్యాగానికి గుర్తుగా మేక, గొర్రెలను ముస్లీం లు ఖుర్బాని ఇస్తారు. గురువారం కూడా అనేక మంది మ స్లీం సోదరులు మేక పోటెళ్లను ఖుర్బానీ ఇచ్చారు. జనచైతన్య కాలనీ లో ఉన్న జామా మసీదు ఘుడాబేగ్ వద్ద ముస్లీం సోదరులు పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ పెద్దలు సయ్యద్ హిదాయతుల్లా షఫీ, సర్ఫరాజ్ సిద్ధిఖీ, సుజాత్ పటేల్, ముజాహిద్ సికిందర్, ఖయ్యూం లతో పాటు పలువురు ముస్లీం సోదరులు, మత పెద్దలు పాల్గొన్నారు.

**ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ :**

ఈద్ ఉల్ అధా సందర్భంగా ముస్లిం సోదరులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లీం సోదరులకు బక్రీద్ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారిలో తెలం గాణ మహిళా కమిషన్ సభ్యురాలు ఎ సదాలక్ష్మీ, సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ దేశాల భూ పాల్, వివిధ పార్టీల నాయకులు సామ భూపాల్ రెడ్డి, టి ప్రేందాస్ గౌడ్, సానెం శ్రీనివాస్ గౌడ్, కె రఘు గౌడ్ లు ఉన్నారు.

## తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప నాయకుడు

### ఎన్టీఆర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, మే 28(నమస్తే ఉదయం)**



స్వర్గీయ మాజీ సీఎం ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలు ఘటిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప నాయకుడు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టి.రామారావు అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ కొనియాడారు. శుక్రవారం తెలుగుదేశం వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్వగృహం ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ పి ప్రేమ్దాస్ గౌడ్, సుధాకర్ గౌడ్, రవి గౌడ్ లతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... అట్టడుగు వర్గాలకు అధికారం కట్టబెట్టిన మహానేత ఎన్టీఆర్ అన్నారు. బడుగు బలహీన వర్గాలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగటానికి ప్రోత్సహించిన మహా నేత ఎన్టీఆర్ అన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేడు దేశానికి స్ఫూర్తిదాయకంగా శ్రీకారం చుట్టాయి అన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయాల కోసం ప్రజలకు సేవ చేస్తూ ప్రజాహితమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు.

## దేశంలో అనేక సంస్కరణలకు ఆధ్యులు ఎన్టీఆర్

### టీ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి

**బుద్వేల్, మే 28 (నమస్తే ఉదయం):**



పాండు రంగా నగర్ లో టీడీపీ జెండా ఎగురవేస్తున్న ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి, తదితరులు

దేశంలో అనేక సంస్కరణలకు ఆధ్యులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అని తెలంగాణ తెలుగుదేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి అన్నారు. రాజేం ద్రనగర్ నియోజకవర్గం టీడీపీ ఆధ్వర్యంలో గురువారం అత్తాపూర్, రాజేంద్రనగర్ సర్కిళ్లలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. హైదర్ గూడ, అత్తాపూర్, పాండురంగానగర్ బస్తీలలో టీడీపీ జెండాలను ఎగురవేశారు. ఆనంతరం సామ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ, పేద, మద్య తరగతి ప్రజలలో రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన మహానీయులు ఎన్టీఆర్ అన్నారు. రెండు రూపాయలకు కిలో బియ్యం, తక్కువ ధరకే వ్యవసాయ కరెంటు సరఫరా, పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు, మహిళలకు ఆస్తి హక్కులో వాటా లాంటి ఆనేక పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేసింది ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. ఆయన ఆశయాల సాధన కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాబోయే రోజులలో తెలంగాణ లో తెలుగుదేశం పార్టీ కీలక పాత్ర పోషించే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎ క్రిష్ణారెడ్డి, సోమారం రాజ్ కుమార్, ఎస్ చంద్రశేఖర్ రెడ్డి , కొండారెడ్డి, ధన్ పాల్ రెడ్డి. ఎన్ వెంకటేశ్, ఆనంద్, బాలప్ప, యుగేందర్, సురేశ్, చంద్రశేఖర్ పాండ తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థుల
# గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలి

### ఎన్టీఆర్ మహా నాయకుడు ... ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

**బుద్వేల్, మే 28 (నమస్తే ఉదయం):**



కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం మైలార్దేవుపల్లి లోని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ నివాసంలో కాటేదాన్, మైలార్దేవుపల్లి డివిజన్ల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మరో నాలుగైదు నెలల్లో జీహెచ్ఎంసీ ఎన్నికలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎన్నికలలో విజయం సాదిం చడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. బూత్ స్థాయి కమిటీలను వేసి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. పార్టీ ఎవరిని కార్పొరేటర్ అభ్యర్థిగా నిలబెట్టినా వారి విజయం కోసం అంకిత భావంతో పనిచేయాల్సి ఉ ంటుందన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి మంచి గుర్తింపు ఉంటుం దన్నారు. కాటేదాన్, మైలార్దేవుపల్లి డివిజన్లను అభివృద్ధి చేసింది నేనేనని, ఏ బస్తీలో ఏ పనికావాలన్నా చేయించే బాధ్యత నాదేనన్నారు. ప్రతి నాయకుడు ప్రజలలోకి వెళ్లి వారి కష్టసుఖాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి బాటలు వేయాలన్నారు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి ప్రేందాస్ గౌడ్, మైలార్దేవుపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎన్ ధనుంజయ, సీనియర్ నాయకులు టి ప్రేంగౌడ్, సోమ శ్రీనివాస్ గుప్తా, సరికొండ వెంకటేశ్, ఎ మాధవరెడ్డి, పి సుధాకర్ గౌడ్, అడికె అర్జున్, ఎస్ జైపాల్, లలితారెడ్డి, భూదేవి, శరణమ్మ, కె. శ్రీనివాస్రెడ్డి, ఊరె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ : మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామరావు 103వ జయంతి సందర్భంగా మైలార్దేవుపల్లి లోని తన నివాసంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలసి కేక్ కట్ చేశారు. ఎన్టీఆర్ సేవలను గుర్తు చేసుకున్నారు. పేద, మద్య తరగతి ప్రజలలో రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన మహా నేత ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి ప్రేందాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ వై.హరిచరణ్, కాంగ్రెస్ నాయకులు రగడంపల్లి శ్రావణ్, రవి గౌడ్, యేసు, శ్రీనివాస సేవా సమితి అధ్యక్షులు పెండ్యాల సాయిమల్లిక్, నారాయణ తో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాబోయే పదేళ్లలో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి
# గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కార్యాచరణ

### రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నె ముకలాంటిది

### మీరు నిర్మిస్తున్న భవనాలే తెలంగాణ భవిష్యత్తుకు పునాది రాళ్లు

### ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**కూకట్ పల్లి, మే 28 (నమస్తే ఉదయం)**




నారెడ్కో వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవ వేడుకలు, వార్షిక సర్వసభ్య సమావేశం గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఈ పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, సావనీర్ పుస్తకాలను విడుదల చేసారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి, పురోగతిలో కీలక పాత్ర పోషించే రియల్ ఎస్టేట్ రంగానికి మద్దతునిచ్చి దానిని బలోపేతం చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సుదీర్ఘంగా 400 ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందుతూవుంది. రాబోయే పదేళ్లలో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం కార్యాచరణ కొనసాగిస్తోందన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఫ్యూచర్ రెడీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, ఎఐ సిటీ, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి భారీ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి కీలకమని తెలిపారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం తెలంగాణ అభివృద్ధికి వెన్నెముకలాంటిని పేర్కొంటూ, ఆధునిక సాంకేతికత, నాణ్యత ప్రమాణాలు, పర్యావరణ హిత నిర్మాణాలపై బిల్డర్లు దృష్టి పెట్టాలని సూచించారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే స్థిరమైన, స్మార్ట్ అర్బన్ డెవలప్‌మెంట్ పై దృష్టి పెట్టాలని కోరారు. హైదరాబాద్‌ను రాబోయే పదేళ్లలో ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మా ప్రభుత్వ లక్ష్యం కేవలం చరిత్ర సృష్టించడమే కాదు, కాలంతో పాటు దానిని మార్చడం. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు మేము ఒక సమగ్ర ప్రణాళికను అమలు చేస్తున్నాము అని అన్నారు. మీకు ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతాను. నావంతు సహాయ సహకారాలు ఎల్లపుడు మీకు ఉంటాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నారెడ్కో వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు డా. సత్యం శ్రీరంగం, నర్రా నాగేశ్వర రావు, నారెడ్కో నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ పూర్వ అధ్యక్షుడు హరి బాబు, తెలంగాణ అధ్యక్షుడు కె. శ్రీధర్ రెడ్డి జనరల్ సెక్రటరీ ఆర్. వెంకటేశ్వర రావు, కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు కాళి ప్రసాద్, గోపాల కృష్ణ, ఉపాధ్యక్షుడు ఎం. ప్రేమ కుమార్, టీబీఎఫ్ అధ్యక్ష్యుడు సి.ప్రభాకర్ రావు, నారెడ్కో వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ వడ్డేపల్లి రంగ రావు, వైస్ చైర్మన్ బి. లక్ష్మీ నారాయణ, అధ్యక్షుడు కోటేశ్వర రావు, సలహాదారులు, నారెడ్కో జనరల్ సెక్రటరీ కె.వి. ప్రసాద రావు, ట్రెజరర్ సిహెచ్. రామ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు వేళువోలు శ్రీనివాస రావు, పెద్ద ఎత్తున బిల్డర్స్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతి వేడుకలు

### వివేకానంద నగర్‌లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహణ

### ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ హాజరు

**కూకట్ పల్లి, మే 28 (నమస్తే ఉదయం)**



శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన స్వర్గీయ నటసార్వభౌముడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, పీఏసీ చైర్మన్ హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైన ఎన్టీఆర్ అభిమానులు, స్థానిక ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు కలిసి ఎన్టీఆర్ ని స్మరించుకుంటూ పూలతో నివాళులు అర్పించారు. కార్యక్రమ ప్రాంగణం మొత్తం ఎన్టీఆర్ చిత్రపటాలు, జెండాలు, నినాదాలతో కళకళలాడింది. అభిమానుల హర్షధ్వానాల మధ్య ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కేక్ కట్ చేసి అభిమానులకు కేక్, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ ఎన్టీ రామారావు తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, మహిళలకు ఆస్తి హక్కు కల్పించడం, పేదలకు ఉచిత బియ్యం అందించడం, మారుమూల గ్రామాలకు రోడ్లు, మంచినీరు, విద్యుత్, రవాణా సౌకర్యాలు కల్పించడం వంటి అనేక సంక్షేమ పథకాలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు" అని పేర్కొన్నారు. అలాగే రాజకీయాల్లో సామాన్య ప్రజలకు అవకాశాలు కల్పించి ఎంతో మందిని ఉన్నత స్థానాలకు తీసుకెళ్లిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. నేడు భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పాలన తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి" అని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలకు హాజరైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రకాంతరావు, సంజీవరెడ్డి, రామకృష్ణ, మల్లయ్య, లింగయ్య, లక్ష్మీబాయి, యాదగిరి, శ్రీధర్, సూర్యనారాయణ, మూర్తి, జి.ప్రసాద్, రామ్ రెడ్డి, చల్లారావు, సునీల్ పటేల్, కిషోర్ గ్రానైట్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతి వేడుకలతో వివేకానంద నగర్ ప్రాంతం పండుగ వాతావరణాన్ని తలపించింది. అభిమానులు ఎన్టీఆర్ నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించి, ఆయన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు.



## తెలుగుజాతి పౌరుషాన్ని దశ దిశలా వ్యాపింపజేసింది నందమూరి తారక రామారావు

### కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్

**కూకట్ పల్లి, మే 28 (నమస్తే ఉదయం)**

తెలుగుజాతి పౌరుషాన్ని దశ దిశలా వ్యాపింపజేసిన నందమూరి తారక రామారావు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయం అని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు 103వ జయంతి వేడుకలను గురువారం వీధి వీధిన వాడవాడలా ఆయన అభిమానులు పార్టీ కార్యకర్తలతోపాటు కాంగ్రెస్ నాయకులు సైతం ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ లు, ద్విచక్ర వాహన ర్యాలీలు, రక్తదానాలు, అన్నదానాలు గొప్పగా నిర్వహించారు. కెపిహెచ్బి కాలనీ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ లో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని బండి రమేష్ సందర్శించారు. ఈ శిబిరం నిర్వాహకుడు వెంకట్రావు ని రమేష్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు గరికపాటి రామ్మోహన్ రావు కూడా హాజరయ్యారు. వసంత నగర్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి రమేష్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఇక్కడ కార్యక్రమానికి వేలాది మంది తెలుగుదేశం పార్టీ అభిమానులు హాజరయ్యారు. అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ప్రగతి నగర్ తో పాటు ఎన్టీఆర్ ఘాట్ వద్ద జరిగిన ఎన్టీఆర్ జయంతి కార్యక్రమానికి బశీడి రమేష్ హాజరై ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్) డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం ను గురువారం కలసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన బీజేపీ గోల్కొండ గోషామహల్ జిల్లా ఇంచార్జి వై.శ్రీధర్, రాజేంద్రనగర్ డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఇ వేణుగోపాల్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ అధికారి శితాంశు, జస్వంత్ తదితరులు

- బుద్వేల్, నమస్తే ఉదయం

# ఖాకీ వనంలో 'సిఫారసుల' జాతర

## సైబరాబాద్ బదిలీల వెనుక అసలు కథ!

### సీఎం ఆదేశాలకూ, పైరవీలకూ మధ్య నలుగుతున్న 'కమిషనరేట్'.. 65 మంది సీఐలు, 32 మంది ఎస్ఐల భవితవ్యం ఎటువైపు?

**శేరిలింగంపల్లి : మే 28, (నమస్తే ఉదయం)**




శాంతిభద్రతలకు పట్టుగొమ్మ.. ఐటీ కారిడార్‌కు రక్షణ కవచం.. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ కీర్తిని మోసే గుండెకాయ.. అదే "సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్" నిత్యం కోట్లాది రూపాయల టర్నోవర్ జరిగే వ్యాపార సామ్రాజ్యాలు, వేల ఐటీ కంపెనీలు, సెలబ్రిటీల నివాసాలు ఉండే ఈ హైప్రొఫైల్ ఏరియాలో 'శాంతిభద్రతలను కాపాడటం' అంటే కత్తిమీద సామే. అలాంటి కమిషనరేట్‌లో ఇప్పుడు ఒకేసారి 65 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల (సీఐ) బదిలీల వ్యవహారం కేవలం పోలీస్ శాఖలోనే కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లోనూ పెను తుఫాను సృష్టిస్తోంది.ముఖ్యమంత్రి వైపు నుంచి పైరవీలు వద్దు.. కేవలం పనితీరుకే ప్రాధాన్యత ఇవ్వాలన్న స్పష్టమైన కఠినమైన ఆదేశాలు ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం సీన్ పూర్తిగా రివర్స్ అయింది. ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు, తెరవెనుక సాగుతున్న పైరవీల చక్రబంధంలో బదిలీల ప్రక్రియ చిక్కుకుపోయింది. అసలు సైబరాబాద్‌లో ఏం జరుగుతోంది? 'క్రీమీ' పోస్టుల కోసం జరుగుతున్న వేట వెనుక ఉన్న మర్మమేంటి? ఈ వ్యవస్థ ఎటు వైపు వెళ్తోంది? అర్థం కాని పరిస్థితి నెలకొంది.సిఫారసుల 'చక్రబంధం'.. కమిషనరేట్‌పై పొలిటికల్ ప్రెజర్! "చట్టం ముందు అందరూ సమానులే.. కానీ కొందరు అధికారులు మాత్రం ప్రజాప్రతినిధుల ముందు మోకరిల్లితేనే పోస్టింగ్స్ దక్కుతాయని నమ్ముతున్నారు. సైబరాబాద్ కమిషనరేట్ చరిత్రలోనే మున్నెన్నడూ లేని విధంగా ఒకేసారి 65 మంది సీఐల బదిలీ జరిగాయి. ఆర్డర్ వచ్చిన గంటలోపే ఎవరు బదిలీ కావల్సిన అవసరం లేదు ఎంత స్థితిని కొనసాగించాలని మళ్లీ ఆదేశాలు ఇవ్వడం తీవ్రతలు గందరగోళానికి గురిచేసింది. అయితే, ఏ బదిలీలైనా నిబంధనల ప్రకారం, సీనియార్టీ, ట్రాక్ రికార్డ్ ఆధారంగా జరగాలి. కానీ ఈసారి బదిలీల ప్రక్రియ చివరి నిమిషంలో 'సిఫారసుల' ఉచ్చులో చిక్కుకుంది.

ముఖ్యంగా అధికార పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, కీలక నేతలు తమకు అనుకూలమైన అధికారుల కోసం సిఫారసు లేఖల వర్షం కురిపించారు. ఒకే ఒక్క 'కీలక' పోలీస్ స్టేషన్ కోసం ముగ్గురు, నలుగురు ఎమ్మెల్యేలు వేర్వేరు అధికారుల పేర్లను ప్రతిపాదిస్తూ సీపీ ఆఫీస్‌పై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం.

**ఁసీపీ ముందున్న సవాల్**

ఒకవైపు ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం నిష్పక్షపాతంగా వ్యవహరించాలి, మరోవైపు క్షేత్రస్థాయిలో ఉన్న అధికార పార్టీ ఎమ్మెల్యేలను నొప్పించలేరు. ఈ పొలిటికల్ ప్రెజర్ తట్టుకోలేక సైబరాబాద్ పోలీస్ కమిషనర్ బదిలీల ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ వేయడం ఇప్పుడు పోలీస్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ జాప్యం వల్ల నిజాయితీగా పని చేసే అధికారుల్లో తీవ్ర అసంతృప్తి, గందరగోళం నెలకొంది.'రూల్స్' పక్కనబెట్టి.. ఎక్కడికక్కడే పోస్టింగ్స్?

పోలీస్ శాఖలో బదిలీలకు కొన్ని నిర్దిష్టమైన నిబంధనలు ఉంటాయి. నిబంధనల ప్రకారం.. వేరే జోన్ల (మల్టీ జోన్ హైదరాబాద్, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్ సిటీ) నుంచి బదిలీపై వచ్చిన అధికారులు మొదట సైబరాబాద్ కమిషనరేట్‌లో రిపోర్ట్ చేయాలి. కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో వారి వివరాలను నమోదు చేసిన తర్వాత, ఖాళీలను బట్టి వారికి పోస్టింగ్స్ కేటాయించాలి. కానీ ప్రస్తుత బదిలీల వ్యవహారంలో ఈ రూల్స్ అన్నీ తుంగలో తొక్కినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొందరు ప్రసిద్ధ, ప్రభావవంతమైన అధికారులు తాము పాత జోన్లలోనే ఉంటూ, సైబరాబాద్‌లోని 'క్రీమీ' స్టేషన్లలో పోస్టింగ్స్ దక్కించుకునేలా తెరవెనుక భారీ స్కెచ్ నడిపినట్లు తెలుస్తోంది. తీరా చివరి క్షణంలో తాము అనుకున్న వారికి పోస్టింగ్స్ రాకపోవడంతో, కొందరు రాజకీయ నేతలు నేరుగా సీపీపైనే అసహనం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ తరహా వ్యవహారాలు పోలీస్ శాఖ క్రమశిక్షణను ప్రశ్నిస్తున్నాయి.

**'క్రీమీ' స్టేషన్ల కోసమే పీటముడి**

ఈ బదిలీల గందరగోళానికి, ఉత్కంఠకు అసలు కారణం కొన్ని 'కీలక' పోలీస్ స్టేషన్లే. ఆదాయం, పరపతి, రాజకీయ ప్రాబల్యం ఎక్కువగా ఉండే ప్రాంతాలను పోలీస్ పరిభాషలో 'క్రీమీ' లేదా 'హాట్ సీట్లు' అంటారు. పోలీస్ స్టేషన్ పోటీకి గల ప్రధాన కారణాలు.

మాదాపూర్, గచ్చిబౌలి, ఐటీ హబ్ పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలు, పబ్‌లు, నైట్ లైఫ్ హై-ప్రొఫైల్ కేసులు. మియాపూర్, నార్సింగి రియల్ ఎస్టేట్ లావాదేవీలు, భూ వివాదాలు, వేగంగా విస్తరిస్తున్న నివాస ప్రాంతాలు. అమీన్‌పూర్, పారిశ్రామిక ప్రాంతాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్లు భారీ ఆర్థిక లావాదేవీలు. ఈ స్టేషన్లలో పోస్టింగ్ దక్కించుకోవడం కోసం సీఐలు గట్టి పోటీ పడుతున్నారు. ప్రజాప్రతినిధుల అడుగులకు మడుగులొత్తే వారికే ఈ స్థానాలు దక్కుతున్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఎవరైతే రాజకీయ నేతల ఆర్థిక, వ్యక్తిగత అవసరాలకు సహకరిస్తారో.. వారికే ఈ సీట్లు కేటాయించాలని నేతలు పట్టుబడుతుండటంతోనే బదిలీల ప్రక్రియపై 'పీటముడి' పడింది.

**పిల్లల చదువులు.. సీఐలలో పెరుగుతున్న టెన్షన్!**

రాజకీయ నాయకుల ఆటలో నలిగిపోతున్నది మాత్రం సాధారణ అధికారుల కుటుంబాలే. ప్రస్తుతం వేసవి సెలవులు ముగిసిపోతున్నాయి. జూన్ మొదటి లేదా రెండో వారంలో పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. బదిలీ కాబోయే అధికారుల పిల్లల స్కూల్ జాయినింగ్స్, అడ్మిషన్ల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మేము ఎక్కడికి బదిలీ అవుతామో తెలిస్తే అక్కడ మా పిల్లలను స్కూళ్లలో చేర్పించుకుంటాం. ఈ ఆలస్యం వల్ల మంచి స్కూళ్లలో సీట్లు దొరకడం కష్టమవుతోంది" అని ఓ సీఐ ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ మానవీయ కోణాన్ని గమనించిన సీపీ.. రెండు మూడు రోజులలో ఈ ప్రక్రియను ఎలాగైనా పూర్తి చేయాలని యోచిస్తున్నారు. సీఎం ఆదేశాల ప్రకారం కేవలం 'పనితీరు' ఆధారంగానే, ఎలాంటి పొలిటికల్ ఇన్‌ఫ్లుయెన్స్ లేకుండా మరో రెండు, మూడు రోజుల్లో ఈ బదిలీ ప్రక్రియను పూర్తిగా కొలిక్కి తీసుకురావాలని భావిస్తున్నారు.

లిఎస్ఐల పోస్టింగుల సస్పెన్స్ సెక్టార్ల కేటాయింపు ముందా? సీఐల బదిలీ ముందా! సీఐల బదిలీల గందరగోళంతో పాటు హైదరాబాద్ కమిషనరేట్ నుండి 32 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు సైబరాబాద్‌లో రిపోర్ట్ చేశారు. ఇప్పుడు వాళ్ళందరికీ కూడా పోస్టింగ్స్ ఇవ్వాల్సి ఉంది. ఇక్కడే ఒక సాంకేతిక, పరిపాలనా పరమైన గందరగోళం నెలకొంది. ఎస్ఐలకు, సీఐలకు ఒకేసారి పోస్టింగ్స్ ఇస్తారా? లేదా ఎస్ఐలకు మొదట పోలీసు స్టేషన్లలో పోస్టింగ్ ఇచ్చి, వారికి సెక్టార్లు అలాట్ చేసిన తర్వాత సీఐలను బదిలీ చేస్తారా?

సాధారణంగా ఒక స్టేషన్‌లో సీఐ (స్టేషన్ హౌస్ ఆఫీసర్) బాస్ గా ఉంటారు. ఆయన కింద ఎస్ఐలు పని చేయాలి. ప్రస్తుతం ఉన్న సీఐలు రిపోర్ట్ చేసిన ఎస్ ఐలకు సెక్టార్ అలాట్ చేసేస్తే గత నెల. రోజులుగా పెండింగ్ లో ఉన్న కేసులను వచ్చిన ఎస్ఐలు దర్యాప్తు చేస్కోవచ్చు. ఎస్సైలకి సీఐఎల్ కి ఒకేసారి పోస్టింగ్ ఇస్తే స్టేషన్ మళ్ళీ గాల్లో పడాలంటే 15 రోజులు సమయం పట్టే అవకాశం ఉంది అసలే గత నెల రోజుల నుండి ఎస్సైలు లేకపోవడంతో అనేక ఫిర్యాదులు కేసులు స్టేషన్లో పెండింగ్ లో ఉన్నాయి. రేపు వచ్చే సీఐతో వారికి సింక్ కుదురుతుందా లేదా అనేది పెద్ద ప్రశ్న. ఈ క్లారిటీ లేకపోవడం వల్ల అటు ఎస్ఐలు, ఇటు సీఐలు ఇద్దరూ తీవ్ర ఉత్కంఠలో కొట్టుమిట్టాడుతున్నారు.

ఈ బదిలీల పర్వం కేవలం పోలీస్ శాఖకు సంబంధించిన అంతర్గత వ్యవహారం మాత్రమే కాదు. ఇది నేరుగా సమాజ భద్రతతో, సామాన్యుడి ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశం. సమాజం మేల్కొని ఆలోచించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

నిజాయితీకి స్థానం లేదా?: ఒక అధికారి తన ప్రతిభతో, రాత్రింబగళ్లు కష్టపడి శాంతిభద్రతలను కాపాడితే అతనికి గుర్తింపు ఉండదా? కేవలం నేతల చుట్టూ ప్రదక్షిణలు చేసి, 'రికమండేషన్ లెటర్లు' తెచ్చుకున్న వారికే లూప్‌లైన్ కాకుండా మంచి పోస్టింగులు దక్కితే.. ఇక నిజాయితీగా పని చేసే అధికారుల మార్కెట్ విలువ ఏంటి? పొలిటికల్ రికమండేషన్‌తో వచ్చే అధికారి.. రేపు క్రైమ్ జరిగినప్పుడు చట్టప్రకారం నడుచుకుంటాడా? లేక తనకు సిఫారసు చేసిన నేత మాట వింటాడా? దీనివల్ల సామాన్యుడికి న్యాయం జరుగుతుందా? పోలీస్ శాఖ అనేది ఒక స్వతంత్ర రక్షణ వ్యవస్థ. అందులోకి రాజకీయ జోక్యం ఈ స్థాయిలో ఉంటే, వ్యవస్థ తన పట్టు కోల్పోయే ప్రమాదం ఉంది.

**,ఎవరికి 'లక్'.. ఎవరికి 'షాక్'?**

సైబరాబాద్ బదిలీల 'జాతర' ఇప్పుడు చివరి ఘట్టానికి చేరుకుంది. భారీగా అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఒకవైపు వినబడుతుండగా.. వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ కమిషనర్ క్లీన్ అండ్ క్లియర్ లిస్ట్‌ను బయటకు తీస్తారా అనేది చూడాలి.

ముఖ్యమంత్రి పట్టుదల.. కమిషనర్ నిబద్ధత.. ఎమ్మెల్యేల ఒత్తిళ్లు.. వీటన్నింటి మధ్య నలుగుతున్న 65 మంది సీఐలు, 32 మంది ఎస్ఐల భవితవ్యం మరికొన్ని గంటల్లో తేలిపోనుంది. ఈ బదిలీల వేటలో అర్హులైన వారికి 'లక్' వరిస్తుందో.. లేక పైరవీకారులకు 'షాక్' తగులుతుందో చూడాలి. ఏది ఏమైనా, సైబరాబాద్‌లో శాంతిభద్రతలు వర్ధిల్లాలంటే.. 'రాజకీయ రంగు' లేని ఖాకీల పాలన అత్యంత అవసరం!

# 'రాయ'ల్ రికార్డు.. భాగ్యనగర భూమి 'బంగారం'!

### ఐటీ హబ్‌లో ఆకాశాన్నంటిన ధరలు.. ఎకరం రూ.237 కోట్లు!

### 6 ఎకరాల 19 గుంటల భూమికి రూ. 1,534.57 కోట్లు


### గత ఏడాది రికార్డు (రూ. 177 కోట్లు) గాల్లో దీపమే

### లిదేశంలోనే అత్యంత ఖరీదైన కమర్షియల్ హబ్‌గా రాయదుర్గం

**శేరిలింగంపల్లి : మే 28, (నమస్తే ఉదయం)**

విశ్వనగరం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ చరిత్రలోనే మరో సువర్ణ అధ్యాయం లిఖించబడింది. అంతర్జాతీయ స్థాయిలో భాగ్యనగరం తన సత్తా ఏంటో మరోసారి చాటిచెప్పింది. ఐటీ రంగానికి గుండెకాయ లాంటి రాయదుర్గం ప్రాంతంలో భూముల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. ఎంతలా అంటే.. అక్కడ అడుగు భూమి కొనాలన్నా సామాన్యులకే కాదు, బడా వ్యాపారులకు సైతం గుండె గుభేల్ అనేలా సరికొత్త రికార్డు సృష్టించింది.తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) నిర్వహించిన ప్రభుత్వ భూముల బహిరంగ వేలంలో రాయదుర్గం పాన్ మక్తా పరిధిలోని సర్వే నంబర్ 83/1లో ఉన్న భూమి సరికొత్త సంచలనానికి తెరలేపింది. నాలెడ్జి సిటికి అతి సమీపంలో ఉన్న భూమికి జరిగిన వేలంలో ఎకరం ధర ఏకంగా రూ. 237 కోట్లు పలికి అందరినీ విస్మయానికి గురిచేసింది.


**పోటీపడ్డ దిగ్గజాలు.. ప్రభుత్వానికి కాసుల వర్షం**




ఈ వేలంలో భాగంగా ఉన్న 6 ఎకరాల 19 గుంటల భూమిని దక్కించుకునేందుకు దేశీయ, అంతర్జాతీయ ప్రముఖ నిర్మాణ సంస్థలు భారీగా పోటీ పడ్డాయి. చివరికి ఎకరాకు రూ. 237 కోట్ల చొప్పున.. మొత్తం 6 ఎకరాల 19 గుంటల స్థలానికి గానూ ప్రభుత్వానికి రికార్డు స్థాయిలో లిలిరూ. 1,534.57 కోట్ల భారీ ఆదాయం సమకూరినట్లు అధికారులు అధికారికంగా వెల్లడించారు.

**పాత రికార్డులు గాల్లో దీపాలే..!**

"గతేడాది ఇదే రాయదుర్గం ప్రాంతంలో ఎకరం భూమి రూ. 177 కోట్లు పలికి అప్పట్లో దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. కానీ తాజా వేలంతో ఆ పాత రికార్డు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. గతేడాదితో



పోలిస్తే ఈసారి ఎకరాపై అదనంగా రూ. 60 కోట్లు పెరగడం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు నిదర్శనం."

హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, శరవేగంగా విస్తరిస్తున్న ఐటీ రంగమే ఈ స్థాయి ధరలకు కారణమని రియల్ ఎస్టేట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ చారిత్రాత్మక వేలంతో దేశంలోనే అత్యంత ఖరీదైన ప్రతిష్టాత్మకమైన కమర్షియల్ హబ్‌గా రాయదుర్గం తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. ఈ విజయం భాగ్యనగర కీర్తికిరీటంలో మరో మణిహారంగా నిలిచిపోనుంది.





# రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?..

### గుంతలమయంగా రహదారులు

### వర్షం వస్తే మడగును తలపిస్తున్న రోడ్డు

### నిత్యం గుంతల రోడ్లలో నరక ప్రయాణాలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 28 ( నమస్తే ఉదయం)**

ఇటీవల కురిసిన వానలకు గద్వాల నియోజకవర్గంలో రోడ్లన్నీ గుంతల మయంగా మారాయి. గుంతల మయమైన రోడ్లతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా రోడ్లకు మరమ్మతులు చేసేందుకు మాత్రం ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు.గద్వాల-రాయచూర్ రహదారిపై జాంపల్లి గ్రామ శివారులో గల తాయమ్మా మిట్ట వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక ద్విచక్ర వాహనదారులు, ఆటోడ్రైవర్లు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఈ రహదారిపై రోజుకు వేలాది సంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగిస్తాయి. గుంతల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక సంవత్సరాలు గద్వాల రాయచూర్ రహదారి రోడ్డు దుస్థితిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లిన తూతూమంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకులు గాజుల కృష్ణారెడ్డి, నక్క రవి, వీరారెడ్డి ఆరోపించారు. పలు మార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా కూడా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చడంతోపాటు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# ధరూర్ మండలంలో ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 28 (నమస్తే ఉదయం)**

ధరూర్ మండలంలో బక్రీద్ పండుగను గురువారం ముస్లీం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు, ఉప్పేరు, చింతరేవుల వద్ద ఉన్న ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మజీద్ కమిటి సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ముస్లీం సోదరులకు యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సమీర్ ముజాహిద్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ధరూర్ ఎస్ఐ నందీకర్ అధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ముస్లీం సోదరులు తదితరులు పాల్గొన్నారు.



మొదటి బహుమతి విజేత అర్.అర్.అర్ జట్టు

# కేపీఎల్ క్రికెట్ విజేత అర్.అర్.అర్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28(నమస్తే ఉదయం)**

కేటిదొడ్డి మండలం కొండాపురం గ్రామంలో గల శ్రీమారెమ్మ అవ్వ దేవర ఉత్సవాల సందర్భంగా కొండాపురం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కొండాపురం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగ అర్.అర్.అర్ జట్టు నిలిచింది. గురువారం అర్.అర్.ఆర్ , జైశ్రీరామ్ జట్లు తలపడగా అర్.అర్.అర్ జట్టు విజేతగా నిలిచింది. ఆర్.ఆర్.అర్ జట్టు విజేతకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు ట్రోఫీ అందజేశారు. మొదటి బహుమతి కిందా రూ.15,116, రన్నరప్ టీంకు రెండవ బహుమతి కిందా రూ.10,116 నగదు ప్రోత్సాహం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పవన్ కుమార్, నాయకులు శేకర్, ప్రతాప్, వీరారెడ్డి, సత్యాపాల్‌రెడ్డి, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.